క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ట్రాఫిక్ మొదటి సీఐగా మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్ బాషా గతంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐగా, కడపలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హైదరాబాద్, ఏపీ ఇంటెలిజెన్స్ శాఖలలో కూడా పని చేశారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని చెప్పారు.

ఆక్రమణల తొలగింపు

పుల్లంపేట : చిట్వేలి రహదారిలో ఆక్రమణలను సోమవారం తహసీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. పుల్లంపేట – చిట్వేలికి నూతనంగా రోడ్డు మంజూరు కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర ఆక్రమణలు తొలగిస్తున్నామని తహసీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎంపిక

నందలూరు(రాజంపేట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, అన్నమయ్య జిల్లా 77వ వార్షిక సమావేశాలను ఆదివారం మదనపల్లెలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన నూతన అన్నమయ్య జిల్లా కార్యవర్గ ఎన్నికలలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా అల్లం అశోక్ కుమార్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా రవిశంకర్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోహన్ రాజు, డివిజినల్ కో–కన్వీనర్‌గా వై మహేశ్వర బాబు, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా ఎంవి రమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రీజనల్ కన్వీనర్‌గా నరసింహులు

రాజంపేట టౌన్ : ఎస్టీయూ రీజనల్ కన్వీనర్‌గా మండలంలోని మందపల్లె ఏడబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నీరిగట్టు నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

చిన్నమండెం : ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దివ్య అన్నారు. సోమవారం మండలంలో చిన్నమండెం, చిన్నర్సుపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు పుల్లమ్మ, అమీరా బీ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, రాయచోటి బీజేపీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియం శ్రేయస్కరం


సేంద్రియ ఉత్పత్తులతో అధికారులు, విద్యార్థులు

రైల్వేకోడూరు : సేంద్రియం ద్వారా పండించే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం అని వైఎస్సార్ హార్టికల్చర్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ సోమవారం తెలిపారు. స్థానిక వైఎస్సార్ హార్టికల్చర్ కళాశాలలో ప్రయోగాత్మకంగా విద్యార్థుల ద్వారా సేంద్రియ ఎరువులతో కూరగాయాలు పండించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు కె.ఎం.యువరాజ్, డాక్టర్ కె.లలిత, డాక్టర్ సిద్దేశ్వరి, డాక్టర్ దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నందలూరు(రాజంపేట) : మండలంలోని అరవపల్లిలో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి స్థానిక ప్రముఖ డాక్టర్ పివి నరసింహారావు, ఉషా దంపతులు రూ. 1,01,140లను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆకుల చలపతి, పల్లె నాగయ్య, నారపు శెట్టి శివ, ఎ.చరణ్, ఎ.సూర్య తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్ టోర్నీ


పోటాపోటీగా జరుగుతున్న పోటీలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో తలమంచి గిరీషా రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం పోటాపోటీగా సాగాయి. నజరాన భారీగా ప్రకటించడంతో జిల్లాస్థాయి నుంచి 32 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఇప్పటి వరకు పది మ్యాచ్‌లు జరిపినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. కనుమ రోజున విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

రిలే దీక్షలో రైల్వే కార్మిక నేతలు

నందలూరు(రాజంపేట) : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు ఒకరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ (ఎన్ఎఫ్ఐఆర్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్ డివిజన్ ఆదేశాల మేరకు ఎస్‌సీఆర్ఈఎస్ సెక్రటరీ పి.రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసనలో సంఘ్ ట్రెజరర్ చిట్టిబాబు, కిషోర్ దాస్, ఆదినారాయణ, నాగరాజు, ఫజల్, రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రూ.3 వేల ఫించన్ ఇస్తున్న రాష్ట్రం ఏపీ

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


వీరబల్లె(రాయచోటి టౌన్): మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా


సుండుపల్లె(రాజంపేట): పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె(రాజంపేట) : దేశంలో రూ.3వేల ఫించన్ ఇచ్చే ఏకైక రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ అని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఒకసారి మాటిస్తే కచ్చితంగా నిలబెట్టుకుంటారన్నారు. అందుకే పింఛను రూ.3వేలుకు పెంచారన్నారు. వైఎస్సార్ కుటుంబం మనసున్న కుటుంబమని, పేదవారిని తమ కుటుంబ సభ్యులుగా చూసుకుంటారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి, అవినీతి తావులేకుండా పింఛన్లు ఇస్తున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకు బీజేపీ నుంచి టీడీపీ వరకు ఏపీ నుంచి యూపీ వరకు ఎంతో మంది నేతలు పరిపాలించారని ఎవరైనా రూ.3వేలు పింఛన్లను ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, పార్టీ మండల కన్వీనరు రామస్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనరు రహిమాన్, సర్పంచులు శ్రీనివాసులరెడ్డి, శ్రీను, నాగయ్య, ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీటీసీ నసీమాభాను తదితరులు పాల్గొన్నారు.

219 మందికి భూ పట్టాలు పంపిణీ

వైఎస్సార్ జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్షప థకం ద్వారా 219 మందికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి భూ పట్టాలను పంపిణీ చేశారు. భూమిని అమ్ముకునేందుకు వీలుంటుందన్నారు. గతంలో ఏదైనా అవసరాలు కూడా ఇబ్బందిగా ఉండేదన్నారు. జగనన్న శాశ్విత భూ హక్కు భూ సురక్ష ద్వారా పట్టాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవచ్చునన్నారు. రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలన్నారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నాయకుడు సీఎం జగనన్న ఒక్కరేనని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం వీరబల్లె మండల కేంద్రంలో పెంచిన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రిని మించిన తనయుడిగా ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు రూ.3000కు పింఛన్లు పెంచారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పేద ప్రజల ముఖాలలో చిరునవ్వులు చూడాలని ఆయన ఆకాంక్షన్నారు. ప్రతి పేదవాడి కోరిక తీరాలంటే మళ్లీ జగనన్నను దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఎంపీడీఓ మల్లీశ్వరి, వీఆర్ విద్యాసంస్థల అధినేత వీఆర్‌రెడ్డి, జెడ్పీటీసీ శివరాం గౌడ్, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించండి


గంగాప్రసాద్ మున్సిపల్ కమిషనర్

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణ పరిశుభ్రతకు వ్యాపారులు, ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ కోరారు. సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెను పురస్కరించుకుని 50 మంది దినసరి కూలీలతో పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. చెత్త సేకరణ ఆటోలు వీధుల్లోని ప్రతి ఇంటికీ, దుకాణం వద్దకు పంపి చెత్తను సేకరించేలా కార్యాచరణను రూపొందించామని అన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా డంపర్ బిన్‌లో, చెత్తబుట్టలలో వేసుకుని చెత్తసేకరణ వాహనాలకు అందచేయాలన్నారు. రోడ్లపైన, మురుగునీటి కాలువల్లో, ఖాళీప్రదేశాల్లో చెత్తను పారవేయకూడదన్నారు. చెత్తసేకరణ ఆటోల కార్మికులకు అందచేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలంటూ కోరారు.

గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ తోడ్పాటు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి


సమస్యలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని శేషమాంబపురం పంచాయతీలో ఉన్న పాపరాజుపల్లి గ్రామాన్ని సోమవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి సందర్శించారు. ఆ గ్రామ ప్రజలు తమ గ్రామంలో విద్యుత్ సౌకర్యం, రహదారుల సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గతంలో ఆకేపాటి దృష్టికి తీసుకొచ్చారు. వారి అభ్యర్థన మేరకు పాపరాజుపల్లికి విచ్చేసిన ఆకేపాటి ప్రజల సమస్యలను ఆలకించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. వెంటనే విద్యుత్‌శాఖ ఏఈ ఈశ్వరరాజును పిలిపించి సమస్యలు పరిష్కరించారు. అదే విధంగా రహదారుల సమస్యలను త్వరగా తీరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చివరి వరకు వైఎస్ జగన్ అడుగుజాడల్లోనే


సమావేశంలో మాట్లాడుతున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, చివరి వరకు జగనన్న అడుగుజాడల్లో నడుస్తామని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేట టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి తనకు బంధువు అని అతని ఇంట్లో భోజనానికి వెళితే టీడీపీ ఆయనకు టికెట్ ఇస్తే గెలిపిస్తామన్నట్టుగా మీడియా వేదికగా రాయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలా రాసిన పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాను మొదటినుంచి వైఎస్ కుటుంబం వెంటే ఉన్నానని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌తో నడుస్తున్నానని తెలిపారు. పార్టీ తనని గుర్తించి పలు పదవులు కేటాయించిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు పరిష్కరించని ముక్కా రూపానందరెడ్డి పార్టీ మారితే వైఎస్సార్‌సీపీకి జరిగే నష్టం ఏమీలేదని తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన ఏ రోజు పాల్గొనలేదన్నారు. ఇలాంటి నాయకులు పార్టీని వీడితే పార్టీకే శ్రేయస్కరమని అభిప్రాయపడ్డారు. మండలంలోని కార్యకర్తలకు, ప్రజలకు నాలుగేళ్లు అందుబాటులో ఉంటూ అండగా నిలిచానని, భవిష్యత్తులోనూ వారి సమస్యల పరిష్కారానికి పని చేస్తానన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేసి ప్రభుత్వవిప్ కొరముట్ల విజయానికి అందరిని కలుపుకుని ముందుకుపోతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ–2 గుడూరు గౌరీశంకర్ రాజు, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేశుల రఫీ, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, నరేంద్రవర్మ, మల్లెం ఈశ్వరయ్య, లౌడి గంగురాజు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

రాయచోటి టౌన్ : పేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. సోమవారం సుద్దలవాండ్లపల్లె రోడ్డులోని మణికంఠ గిరిపై వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయంలో రాయచోటి అయ్యప్ప సేవా సొసైటీ వారి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. రాయచోటి నియోజక వర్గ పరిధిలోని 10 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 260 మంది పేద విద్యార్థులకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కె.శ్రీనివాస రాజు, ఫైర్ స్టేషన్ అధికారి అనిల్‌కుమార్, ఎంఈఓ బాలాజీ, సొసైటీ అధ్యక్షులు బసిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు ప్రతీకలు


టోర్నీని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : క్రీడలు శరీర దేహ దారుఢ్యానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయని జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురం గ్రామ సమీపంలో ఉన్న ఆట స్థలంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మేడా బ్రదర్స్ సంయుక్తాధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటును జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు ప్రారంభించారు. ముందుగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు ప్రతీకలుగా చెప్పుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జానకిరామయ్య, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి పనులు

ఓబులవారిపల్లె : మండలంలో అందరి సహకారంతో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీరు, రోడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం పంచాయతీరాజ్ డీఈ బాలసుబ్రమణ్యం, వైద్యాధికారి గురుమహేష్‌లు అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మినరసయ్య, ఎంపీడీఓ విజయారావు, వైస్ ఎంపీపీ–1 గూడూరు గౌరీశంకర్ రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీ–2 కె సుమిత్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిలో జగన్ పాలన స్వర్ణయుగం

- హామీలు నెరవేర్చడంలో దేశానికే ఆదర్శం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


సంబేపల్లె: అధికారులు, నాయకులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : అభివృద్ధి, సంక్షేమాలతో రాష్ట్రాన్ని స్వర్ణయుగంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండవరోజు సోమవారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె గ్రామంలోని పొన్నెలవాండ్లపల్లె, మద్దినేని వడ్డెపల్లె, మద్దినేని వాండ్లపల్లె, కైలాసపురంలలో శ్రీకాంత్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డితో కలిసి ప్రతి ఇల్లు తిరిగి పథకాల అమలును వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి పథకాలు అందేలా అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఏ ఇంటికి వెళ్లినా మీకు ఏయే పథకాలు లబ్ధి పొందారని అడుగుతుంటే గ్రామంలో సుమారుగా అన్ని ఇళ్లల్లో ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందామని సంతోషంగా లబ్ధిదారులు సంతోషంగా చెప్పారు. నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ నాగ శ్రీలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఉత్సాహంగా కబడ్డీ పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, సర్పంచ్ అలివేలమ్మ, చిదంబర్ రెడ్డి, షేట్ వెంకట్రామిరెడ్డి, వసంత శ్రీనివాసులు రెడ్డి, నాగరాజు యాదవ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిలను నిర్మించాలి

రాయచోటి అర్బన్ : మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ సీటీఎం చెరువు ఆధారంగా పంటలు సాగు చేసుకుంటున్న రైతుల భూములలో సౌకర్యార్థం అధికారులు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలను నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బెంగళూరు – తిరుపతి హైవే నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలు నిర్మించాలన్న డిమాండ్‌తో మదనపల్లె ప్రాంత రైతాంగంతో కలసి ఆయన సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతాంగం, గ్రామ ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలను నిర్మించాలని తెలిపారు. అనంతరం ఈ మేరకు స్పందనలో జేసీ ఫర్మాన్ అహమ్మద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, సీటీఎం గ్రామస్తులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

జిల్లాలో వలసల నివారణకు వెంటనే కరువు సహాయక చర్యలను చేపట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు క్రిష్ణప్ప డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీల వలసల నివారణ చర్యలు చేపట్టాలంటూ సోమవారం బికెఎంయు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన ప్రదర్శన చేసి, అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. జేసీతో మాట్లాడుతూ వలసలు ఆపేందుకు ఉపాధి పనులు మొదలెట్టాలన్నారు. కూలీని రూ.600కు పెంచాలన్నారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేసీకి ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం డిమాండ్‌తో సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 20వరోజుకు చేరుకుంది. ఉద్యోగులు జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ తమను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం ఈ మేరకు జేసీకి వినతిపత్రాన్ని ఇచ్చారు.

అభివృద్ధితో ప్రజల రుణం తీర్చుకుంటా


గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకొచ్చిన గడప గడపకూ మన ప్రభుత్వం రాయచోటి నియోజకవర్గంలో ముగిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల ప్రజలకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం నియోజకవర్గంలో 186రోజులపాటు జరిగింది. చివరి రోజు సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లెలో ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగారు. కార్యక్రమం ముగిశాక ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో విజయవంతంగా ముగిసిందన్నారు. 98 సచివాలయాల్లో లక్షకుపైగా గృహాలను సందర్శించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా తనకు లభించిన అపూర్వ స్వాగతాలను జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్ చేసిన సంక్షేమాన్ని ప్రజలే వివరిస్తుంటే, సమస్యల పరిష్కారంలో చూపిన చొరవకు లభించిన ప్రజాస్పందన ముగ్ధుడిని చేసిందన్నారు.

గడప గడపనా అభివృద్ధి పనులు..

స్థానిక సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన గడప గడపకూ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు ప్రభుత్వం సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన మౌలిక వసతుల కల్పనకు వాటిని వినియోగించినట్లు పేర్కొన్నారు.

సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధితో ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటానన్నారు. అనంతరం భారీ కేక్‌ను నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులతో కలిసి కట్ చేశారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ

రాజంపేట టౌన్ : జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఫిబ్రవరి 15వ తేదీలోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేలా అధికారులు వారిని ప్రోత్సహించాలని ఎంపీపీ వెంకటనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. జగనన్న ఇళ్లను వీలైనంత త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు వెంటనే మంజూరవుతాయన్నారు. ఎన్నికల కోడ్ వస్తే అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉంటారని, అందువల్ల బిల్లుల మంజూరు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయ వెల్ఫేర్ అధికారులు ఈవిషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకుంటే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ వస్తే ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున సచివాలయ ఉద్యోగులు గర్భిణులకు, చిన్నపిల్లలకు ఇబ్బంది లేకుండా పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో దోమల వ్యాప్తి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలపై వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఏఓ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

రామాపురం : పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రేమాలయం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, విజయలక్ష్మిల మనవడు హేమాన్స్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు.

ముందస్తు సంబరాలు

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం స్కూళ్లకు సెలవులను ప్రకటించిన నేపథ్యంలో చివరిరోజు వివిధ మండలాల్లోని పాఠశాలల్లో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో కనపడగా పలువురు చిన్నారుల సంక్రాంతి వేషధారణలు ఆకట్టుకున్నాయి. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని భోగి మంటలు వేశారు. దాని చుట్టూ కోలాటం, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు సంక్రాంతి విశిష్టతను వివరించారు. – సాక్షి, నెట్‌వర్క్


ఒంటిమిట్ట: రంగవల్లులను వేస్తున్న విద్యార్థులు


రామాపురం: పొంగలిని చేస్తున్న ఉపాధ్యాయులు


చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో..


పెనగలూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


లక్కిరెడ్డిపల్లె: సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు


సంబేపల్లె: కోలాటం ఆడుతున్న విద్యార్థులు


రాయచోటి టౌన్: భోగి మంట చుట్టూ కోలాటం ఆడుతున్న విద్యార్థులు